# శాపగ్రస్తులు

విన్నకోట సుశీలాదేవి

బస్సుదిగి నిల్చున్నాడు శేఖర్!

దుమ్మురేపుకుంటూ వెళ్లిపోయింది బస్సు.

పైన ఎండ మండిపోతోంది.

చుట్టూచూశాడు.

ఆ ప్రదేశమంతా ఎడారిలా వుంది.

ఎక్కడా చిన్న చెట్టయినా కనబడలేదు.

తన వూరు వచ్చి అయిదేళ్లవుతోంది.

అయిదేళ్లల్లో ఈ వూరు ఎంతో మారిపోయినట్లు కన్పిస్తోంది.

బస్సు ఆగిన ఈ చోట ఒక పెద్ద రావిచెట్టు ఉండేది. ఆ చెట్టకిందే హుస్సేన్ సాహెబ్ సైకిలుషాపు ఉండేది. దాని ప్రక్కనే రంగయ్య తాత బడ్డీకొట్టు. దానిముందు చిన్న బెంచీ. ఆ బెంచీ మీద కూర్చుని బీడీలు కాల్చుకుంటూ ఊళ్లోని కబుర్లన్నీ చెప్పుకునే మనుషులు. బస్సులు దిగి ఊళ్లోకి వచ్చే వాళ్లను పలకరిస్తూ క్షేమసమాచారాలను అడుగుతుండే పనీపాటా లేని జనం.

ఏదీ ఆ సందడి..

ఏరీ ఆ మనుషులు...

అసలు చెట్టే లేదు. అంతా శూన్యం. అంతా నిశ్శబ్దం.

వేడిగాలి ఒక్కసారి ముఖాన కొట్టింది. శేఖర్ మోచేత్తో కళ్లు మూసుకున్నాడు. ఎండ

మాడ్చుస్తోంది. రంగయ్య తాత కొట్లో సోడా తాగాలని మధ్యలో ఎక్కడా బస్సు దిగలేదు. సోడా తాగలేదు. తీరా వచ్చి చూస్తే రంగయ్య తాత బడ్డీకొట్టులేదు. ఆ బడ్డీకొట్టు వుండే చెట్టుకూడా లేదు.

ఇప్పుడు ఊళ్లోకి ఎలా వెళ్లడం! ఇక్కడినుండి ఊరు కనీసం అయిదు మైళ్లు ఉంటుంది. ఈ మధ్య నడక అలవాటు తప్పింది.

కాని ఇప్పుడు నడవక తప్పదు.

'ఉస్సురనుకుంటూ శేఖర్ ఎయిర్‌బ్యాగ్ బుజాన తగిలించుకుని- సూట్‌కేస్ చేత్తో పట్టుకుని ఊళ్లోకి నడవసాగాడు.

ఎండ మాడ్చేస్తోంది. రెండు చెవుల్లోంచి వేడిగాలి రివ్వున కొడ్తోంది. దాహంతో గొంతెండిపోతోంది.

రోడ్డుదిగి మట్టిరోడ్డు మీద అడుగుపెట్టాడు. చుట్టూ చూస్తూ ఆశ్చర్య



పోయాడు. పంట నేలంతా బీట లువారిపోయి ఉంది. మొక్కకా దుగదా చిన్న గడ్డిపరక కూడా ఎక్కడా కనబడలేదు. నీటితడి చూసి ఎన్నో ఏళ్లయినట్లుంది. ఇటువేపు వర్షాలు లేవని పేపర్లో చదువుతున్నాడు. కాని పరిస్థితి మరీ ఇంత దారుణంగా ఉంటుందనుకోలేదు.

''వదినా! ఏడవకు.. వదినా! ఏం జరిగిందో చెప్పు.. నాకేమిటో భయంగా వుంది. ఈ ఊరికేవన్నా దెయ్యం పట్టిందా! మనుషుల్లేక పాడుపడిపోయింది?'' ఆవిడ కళ్లు తుడుచుకుని...
''అవునయ్యా ఈ వూరికి దెయ్యమే పట్టింది! మందుల కంపెనీ దెయ్యం పట్టింది!''

అటూ... ఇటూ ఉండే చేలని చూస్తూ మట్టిరోడ్డు మీద నడవడం గొప్ప అనుభూతినిచ్చేది. ఊళ్లోకి వచ్చేవాళ్లను ఆహ్వానిస్తున్నట్టు తలలూపుతూ...కళ్లకు విందు చేసే ఆ పచ్చని చేలు ఏవి?

ఊరందరికి కడుపులు నింపే బంగారు పంటలు ఏవి? ఎండి బీటలు వారిన ఈ నేల తల్లిని చూస్తోంటే రైతు గుండెలు మండిపోలేదా? ఈ పంటచేలు ఇలా ఉంటే– దీనిపై బతికే తన ఊరు ఎలా ఉందో?

ఆత్రంగా– ఆరాటంగా గబగబా అడుగులు వేశాడు శేఖర్. ఊరు సమీపిస్తున్న కొద్దీ గుండెలు గుబగుబలాడసాగాయి.

ఊళ్లోకి అడుగుపెట్టి నిర్విణ్ణుడయ్యాడు.

ఇది ఊరా? శ్మశానమా? అనుకున్నాడు.

ఊరంతా నిర్మానుష్యంగా ఉంది.

ఏ ఇంట్లోనూ సందడి లేదు.

ఇళ్లన్నీ పాడుపడిపోయినట్లున్నాయి.

పేడ కళ్ళాపితో– రంగవల్లులతో పాడిపశువులతో– ధాన్యపుగాదెలతో కళకళలాడే ఇళ్లు...బోసిపోయి ఉన్నాయి.

ఎయిర్‌బ్యాగ్ బుజాన వేసుకుని ఊళ్లోకి అడుగుపెట్టిన శేఖర్‌కి ఇదివరకులా ఆప్యాయంగా పలకరింపుల్లేవు. ప్రేమతో చెప్పే స్వాగతాలు లేవు.

రెండు కుక్కలు ఎదురొచ్చి 'ఎవడీ మనిషి' అన్నట్టు అతన్ని చూసి మొరగసాగాయి.

శేఖర్ రెండు వీధులు దాటి తన ఇంటికొచ్చాడు.

గేటుతీసుకుని లోపలికొచ్చి నిశ్చేష్టుడయ్యాడు.

ఇంటిముందు ఆడుకునే పిల్లలు లేరు. కొట్టంలో పశువులు లేవు. ఇంటి ముందు పందిరికి ఆకుల్లేవు.

చెప్పులు చప్పుడు చేస్తూ అరుగుమెట్టెక్కాడు. ఆ చప్పుడు విని...''బాబాయొచ్చాడు..'' అంటూ అరుస్తూ ఎవురూ పరుగెట్టుకు రాలేదు.

ముందు అరుగుమీద బ్యాగు– సూటుకేసు పెట్టి–

''వదినా!'' అంటూ లోపలికొచ్చాడు.

ఇల్లంతా అయ్యావారి నట్టిల్లులా వుంది. ఇంట్లో ఏ సామానూ లేదు. అన్నయ్యలు– వదిన్లు కనబడలేదు.

శూన్యంగా– నిశ్శబ్దంగా వుంది.

''ఏవయ్యారు వీరందరూ?'' అనుకున్నాడు.

''అన్నయ్యా– వదినా!'' అనుకుంటూ దొడ్లోకి వచ్చాడు. దొడ్లో నూతి గట్టుమీద కూర్చుని పెద్దవదిన ఏదో ఆకుని శుభ్రం చేస్తోంది.

''వదినా!'' అని పిలిచాడు.

''ఎవరూ?'' తలెత్తిందావిడ.

వదిన్ని చూసి తెల్లబోయాడు శేఖర్! ఈమె మనిషా? అస్థిపంజరమా?' అనుకున్నాడు.

''నేను వదినా. శేఖర్ని'' అన్నాడు.

ఆవిడ తెల్లబోతూ చూసింది.

''వదినా! ఏమిటిలా అయిపోయావ్? ఒంట్లో బాగుండటం లేదా?'' అమెని రెండు చేతుల్తో పట్టుకుని అడిగాడు.

ఆవిడ మాట్లాడలేదు.

చేష్టలుడిగిన దానిలా శేఖర్ వేపు వెర్రిగా చూస్తుండిపోయింది.

శేఖర్ భయపడ్డాడు.

''ఇదేమిటి? వదిన ఇలా వుంది? మూర్ఛపోయిందా? ఏమిటి!'' అనుకున్నాడు.

''వదినా! లే..'' మెల్లగా లేచి బుజాలుపట్టుకుని మెల్లగా ఇంట్లోకి తీసుకొచ్చి కూర్చోబెట్టాడు.''

''వదినా... ఇవి తాగు..'' నీళ్ల బాటిలు అందించాడు. ఆవిడకి నెమ్మదిగా త్రాగించాడు.

నీళ్లుతాగి కొంత తెప్పరిల్లింది.

''శేఖర్ ఎన్నేళ్లయింది నిన్ను చూసి! ఎప్పుడొచ్చావ్?'' గొంతు కూడదీసుకుని అడుగుతోంది.

''ఇప్పుడే వదినా! బస్సుదిగి వస్తున్నాను. వదినా! ఏమిటిదంతా! ఊరిలా అయిపోయిందే! మన ఇల్లు కూడా ఇలా వుందే! ఏవయింది? అన్నయ్యలు వదిన్లు ఏరీ? పిల్లలెవురూ కనబడరే!'' ఆరాటంగా అడిగాడు.

ఆవిడ రెండు చేతుల్తో ముఖం కప్పుకుని బావురుమంది.

''వదినా! ఏడవకు.. వదినా! ఏం జరిగిందో చెప్పు.. నాకేమిటో భయంగా వుంది. ఈ ఊరికేవన్నా దెయ్యం పట్టిందా! మనుషుల్లేక పాడుపడిపోయింది?''

ఆవిడ కళ్లు తుడుచుకుని...

''అవునయ్యా ఈ వూరికి దెయ్యమే పట్టింది! మందుల కంపెనీ దెయ్యం పట్టింది!''

శేఖర్ ఆశ్చర్యంగా చూశాడు.

తన వూరు నుండి వెళ్లిన కొత్తలో అన్నగారు తమ వూరికొక ఫ్యాక్టరీ రాబోతోందని తమ బతుకులు బాగు పడతాయని– ఆనందంగా రాశాడు. ఆ విషయం గుర్తొచ్చింది శేఖర్‌కి.

''వదినా! మనూళ్లో ఫ్యాక్టరీ పెడతారని అన్నయ్య అప్పుడెప్పుడో రాశారు. ఫ్యాక్టరీ పెట్టారా! లేదా? ఫ్యాక్టరీ వలన ఊరు బాగుపడుతుందన్నాడుగా అన్నయ్య. ఊరిలా వుందేమిటి? అసలేం జరిగింది! ఆ ఫ్యాక్టరీ ఎవరు పెట్టారు?'' అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

ఆవిడ కొంగుతో ముఖం తుడుచుకుంది.

''ఏం చెప్పమంటావ్ మరిదీ! ఈ ఊరివాళ్ల బతుకులు మరీ అధ్వాన్నమై పోయినాయయ్యా! మేం బతికే మార్గం లేదు. చావొక్కటే మిగిలుంది.''

కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

''ఏమైంది వదినా?''

''ఎక్కడనుండో డబ్బు మూటల్తో వచ్చారు. ఇక్కడ పొలాలు చవగ్గా కొని మందుల కంపెనీ కట్టారు. ఆ మందునీళ్లన్నీ కాలవల్లోకి వదిలారు. నీళ్లన్నీ పచ్చబారాయి. పొలాలన్నీ చవుడెక్కిపోయాయి. కాలవలెండిపోయాయి. పొలాలూడ్చి మూడేళ్లయింది. అప్పులు పెరిగిపోయాయి. బాంకోళ్లు పొలాలు జప్తు చేస్తున్నారు. ఇంకా అప్పులున్నాయ్. ఎలా తీర్చాలో తెలీడం లేదు. మీ అన్నలు కూలీపనికి పోయారు. మీ వదిన్లు మిల్లు పనికెళ్లారు. నేను మిగిలున్నాను.''

ఆ మాటల్లో శేఖర్‌కి తల తిరిగిపోయింది.

''వదినా! పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే నాకెందుకు చెప్పలేదు.''

''ఎలా చెప్పమంటావ్ మరిదీ! నువ్వు వుజ్జోగం కోసం పోయినావు. అక్కడ నీకుజ్జోగం దొరికిందో లేదో? నీకేం ఇబ్బందులున్నాయో?! అన్న నీకు చెప్పొద్దన్నాడు.''

అది విని శేఖర్ నెత్తికొట్టుకున్నాడు.

''అయ్యో! ఎంతపని జరిగింది? ఈ అయిదేళ్లల్లో ఒక్కసారైనా తను ఇటు వస్తే బాగుండేది. ఉద్యోగం కోసం ఎక్కడెక్కడో తిరిగాడు. చివరకు ముంబాయిలో బట్టల మిల్లులో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో నిలదొక్కుకుని కొంత వెనకేశాక ఇంటికి రావాలనుకున్నాడు. ఉద్యోగంలో స్థిరపడి ఏడాదయింది. ఇప్పుడు తనకు బాగానే వస్తోంది. ఆ ఆనందాన్ని తనవాళ్లతో పంచుకోవాలని వచ్చాడు. కాని ఇక్కడ పరిస్థితి వేరుగా ఉంది.

''వదినా పిల్లలేరీ?''

ఆవిడ గతుక్కుమంది! ఏం చెప్పాలో తెలీక తడబడింది. '' ఎంతో దూరం ప్రయాణం చేసి వచ్చావ్! స్నానం చెయ్యి ముందు!'' అంది మాట మారుస్తూ.

శేఖర్‌కి కూడా తలంతా దిమ్ముగా వుంది. ఒళ్లంతా చికాగ్గా వుంది. అతడికూ్కడా స్నానం చేయాలనే వుంది.

''మన బావిలో నీళ్లున్నాయా!''

''కొద్దిగా ఊరాయి. సరిపెట్టుకోవాలి!''

''ఫర్వాలేదులే'' అంటూ ఇంట్లోకి వచ్చి సూట్‌కేసు తెరిచాడు.

''వదినా! పిల్లలకు తెచ్చాను.'' అంటూ స్వీట్లు, బిస్కెట్లు, చాక్లెట్లు తీశాడు.

''ఇవి వదినలకు చీర్లు...అన్నయ్యలకు పంచలు.. '' అంటూ తను తెచ్చినవన్నీ ఇల్లంతా పరిచాడు.

అవన్నీ చూడగానే ఆవిడ దుఃఖం ఆపుకోలేకపోయింది. ఏడిస్తే మరిది ఏమనుకుంటాడోనని. ఎక్కడ అనుమానపడ్తాడోనని. ముఖం ప్రక్కకు తిప్పుకుంది.

''సాయంత్రం వస్తారుగా...అప్పుడు వాళ్లకిస్తాను.'' అంటూ టవల్ పుచ్చుకుని దొడ్లోకెళ్లి ఒళ్లు తడుపుకు వచ్చాడు.

''మరిదికి ఏం పెట్టాలా?'' అని ఆరాటపడసాగింది.

''వదినా! నాకోసం ఇప్పుడేం చెయ్యబోకు. ఈ

పూటకు బ్రెడ్డు, అరటిపళ్లు ఉన్నాయి. సాయంత్రం అందరూ వస్తారుగా! వాళ్లతో కలిసి తింటాను.'' అన్నాడు.

సూట్‌కేసులో నుండి తన బట్టలు తీసుకుని ప్రక్కగదిలో కెళ్లాడు. ఆవిడ తలపట్టుకుని కూర్చుండిపోయింది.

''వదినా తీసుకో.'' బ్రెడ్డు జామ్ అరటిపళ్లు పేపర్ ప్లేటులో పెట్టి తెచ్చాడు.

''ఇప్పుడివన్నీ నాకెందుకు?''

''తిను వదినా! నిన్ను చూస్తోంటే అన్నం తిని ఎన్నాళ్లో అయినట్టుంది!'' అన్నాడు.

రోజులు కాదు. నెలలు అయింది అనుకుందా విడ మనసులో.

చిన్న బ్రెడ్డు ముక్క తీసుకుంది.

''ఫ్యాక్టరీ బాగా పనిచేస్తోంది కదా. అప్పుడు ఫ్యాక్టరీలో ఇంటికొకరికి పని ఇస్తానన్నారుగా.''

''అప్పుడలా అన్నారు.... ఎవ్వరికి ఏం ఇవ్వలా!''

''పొలాలు పాడయితే నష్టపరిహారం ఇవ్వాలిగా.''

''ఎంత అమాయకుడివి మరిదీ. మాటల వరకే అంతా. ఇవన్నీ అడిగితే గూండాలతో కొట్టించారు. ఇళ్లపైబడి దోచుకున్నారు.''

నివ్వెరపోయాడు.

'అర్థబలం-అంగబలం ఉన్నవాడిదే రాజ్యం. న్యాయం లేదు. ధర్మం లేదు. స్వార్థం విలయ తాండవం చేస్తోంది. ఈ గూండా రాజ్యంలో సామాన్యుడు జీవించలేడు. ఎక్కడికైనా వలస వెళ్లాలి. లేదంటే ప్రాణాలు తీసుకోవాలేమో' అనుకున్నాడు.

గుండెల్లోంచి బాధ తన్నుకు వచ్చింది.

దగ్గుతో ఉక్కిరిబిక్కిరయ్యాడు.

ప్రక్కనే ఉన్న బాటిలు ఎత్తుకుని గటగటా తాగాడు.

''వదినా మరో రెండు బ్రెడ్డుముక్కలు తిను.'' బలవంతంగా తినిపించాడు. బాటిలు నీళ్లు అందించాడు. బ్రెడ్డు- అరటిపళ్లు తిని- మంచినీళ్లు తాగగానే ఆవిడ కళ్లల్లో ఆకలి తీరిన తృప్తి వెలిగింది.

''నేను కొద్దిసేపు పడుకుంటాను వదినా.. సాయంత్రం అన్నయ్యలొచ్చేసరికి లేస్తాలే..''

పక్కగదిలోకెళ్లి దుప్పటి పరుచుకుని పడుకున్నాడు. అతనా మాటలు అన్నప్పుడు ఆవిడ ముఖం వెలవెలబోవడం...నిద్రమత్తులో గమనించలేదు శేఖర్. పడుకోగానే కళ్లు మూతలు పడిపోయాయి.

***

శేఖర్ తిరిగి లేచేసరికి ప్రొద్దు పడమరకి వాలుతోంది. చేతి వాచీ చూసుకున్నాడు. నాలుగ్గంటలైంది.

'చాలాసేపు పడుకున్నానే' అనుకుంటూ లేచి ఇంట్లోకొచ్చాడు. వదిన కన్పడలేదు.

'ఎక్కడికెళ్లిందో' అనుకుంటూ దొడ్లో నూతి దగ్గరకు వెళ్లాడు. ఎక్కడో పాతాళంలో ఉన్నాయి నీళ్లు. అతికష్టం మీద అరబక్కెటు నీళ్లు తోడుకుని ముఖం కడుక్కున్నాడు. బట్టలు మార్చుకున్నాడు.

మావయ్య ఇంటికెళ్లాలి. ఊళ్లో స్నేహితుల పరిస్థితి ఎలా వుందో అది చూడాలి. వీలైతే వాళ్లతో ఫ్యాక్టరీ విషయం మాట్లాడాలి. అనుకుంటూ వీధిలోకొచ్చాడు.

ఇంకా ఎండ తగ్గలేదు. పడమటి దిక్కున అక్కడక్కడ నల్లటి మబ్బు తునకలు. అవే నీటి మబ్బులై దట్టంగా వ్యాపించి వానలు కురిస్తే...దూరంగా ఫ్యాక్టరీ గొట్టంలోంచి నల్లటి పొగ...

'బహుశ ఆ మందుల కంపెనీ మూలంగానేమో...మాకు వానల్లేవు మరిదీ...' వదిన అన్న మాటలు గుర్తకొచ్చాయి.

ఇక తను వూరుకోకూడదు. ఊళ్లోవాళ్లను కలుపుకుని వెళ్లి ఫ్యాక్టరీ యజమానుల్తో మాట్లాడాలి. అనుకుంటూ నడుస్తున్నాడు. కాని ఆ వీధుల్లో నడుస్తోంటే తల తిరిగిపోతోందతనికి.

ఏ ఇంట్లోనూ మనిషి అలికిడి లేదు.

ఊరంతా నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా నిర్జీవంగా ఉంది. ఒకళ్లిద్దరు ముసలివాళ్లు ఇళ్లముందు కూర్చున్నారు. వాళ్లు మనుషుల్లా లేరు. కరువు ప్రతినిధుల్లా ఉన్నారు.

శేఖర్ రెండు వీధులు తిరిగాక- రాములోరి గుడి ప్రక్కనుండి పరుగెట్టుకు వస్తున్న స్నేహితుడు శ్రీనివాసులు కనబడ్డాడు.

అతడిని చూడగానే ప్రాణం లేచొచ్చినట్లయింది.

ఎడారిలో నీటి చెలమలా ఎడారిగానున్న ఆ ఊళ్లో శ్రీనివాసులు కనబడటం శేఖర్‌కి ఎంతో ఆనందాన్నిచ్చింది.

చటుక్కున వెళ్లి అతడిని పట్టుకున్నాడు.

బుజం మీద చేతులేసి-

''ఏరా శ్రీనివాసులూ ఎక్కడనుండలా పరుగెత్తుకు వస్తున్నావ్?'' అనడిగాడు.

శ్రీనివాసులు నిలబడ్డాడు.

''నువ్వు'' ఆయాసపడుతూ...శేఖర్ వేపు కళ్లు చికిలించి చూశాడు.

''నేనురా...శేఖరాన్ని...నువ్వేమిటలా చిక్కిపోయావ్..అవునూ... ఎక్కడినుంచి సరుగెట్టుకు వస్తున్నావు?''

''నువ్వా! శేఖర్..చాలా రోజులైందిగా నిన్ను చూసి గుర్తు పట్టలేకపోయాను.'' సంతోషంగా శేఖర్ చేతిని పట్టుకున్నాడు.

''అది సరే...అసలు విషయం చెప్పనేలేదు..''

''మరేం లేదురా! ఊళ్లోకి పశువుల బేరగాళ్లొచ్చారు. మా ఎడ్లను అమ్మేద్దామని ఇంటికి పరుగెడుతున్నా...మా వాళ్లు వెళ్లిపోతారేమోననే భయంతో''

శేఖర్ ఆశ్చర్యపోయాడు.

''ఎడ్లులేకపోతే వ్యవసాయం ఎలా?''

శ్రీనివాసులు నవ్వాడు.

''నీకిక్కడ సంగతులు తెలీవులే. వ్యవసాయం మాట మేం ఎప్పుడో మర్చిపోయాం... నీటిచుక్క లేదు.. పొలాలెండిపోయాయి. ప్రస్తుతం మా అబ్బాయికి వంట్లో బాగాలేదు.. డబ్బుకావాలి. నాకు మిగిలున్న ఆస్తి ఈ ఎడ్లే. వాటినమ్మి.. డబ్బుతో మా వాడి జబ్బు నయం చేస్తా.''

''మీవాడికి ఏం జబ్బు?''

''ఆకలి జబ్బురా...''

''అంటే...'' తెల్లబోతూ అడిగాడు శేఖర్.

''ఒరేయ్! శేఖరం నీతో మాట్లాడుతూ కూర్చుంటే ఆ బేరగాళ్లు వెళ్లిపోతారు. ఈ ఊళ్లోకి వచ్చే ఆఖరి లారీ ఇదే! ఇక బేరగాళ్లు రారు. ఎందుకంటే ఈ ఊళ్లో ఇక ఒక్క పశువు కూడా లేదు! అందుకే తొందరగా నా ఎడ్లను తోలుకెళ్లాలి! నన్నాపకు!''

శేఖర్‌ని తప్పించుకుని శ్రీనివాసులు పరుగు పరుగున వెళ్లిపోయాడు.

శ్రీనివాసులన్న ఆఖరిమాట శేఖర్‌కి బాణంలా తాకింది.

విలవిలలాడిపోయాడు.

పొలవెల్లువలతో కళకళలాడే తన వూరికి ఎంత ఖర్మ పట్టింది? అనుకున్నాడు. ఏంచేయాలో తోచక వీధుల్లో తిరుగుతున్నాడు. ఒకరిద్దరు తెలిసినవాళ్లు కనబడుతున్నారు. కాని వాళ్లు ఏదోలోకంలో ఉన్న మనుషుల్లా ఉన్నారు.

దూరంగా లారీలలో పశువుల్ని ఎక్కిస్తున్న దృశ్యం కనబడుతోంది. పశువులు లారీల్లోకి ఎక్కడానికి మొరాయిస్తున్నాయి. బహుశ కబేళాకు తీసుకెడుతున్నట్లు వాటికి తెలిసిందేమో! వాటిని కొడుతూ- ముల్లుకర్రతో పొడుస్తూ బలవంతంగా ఎక్కిస్తున్నారు. ఆ దృశ్యం చూడలేక శేఖర్ ముఖం తిప్పుకున్నాడు.

ఈ పరిస్థితుల్లో మావయ్యా వాళ్ల కుటుంబం ఎలా వుందోననుకున్నాడు..మావయ్య కూతురు కమలని చూడాలని మనస్సు తహతహలాడింది. గబగబా ఆ వీధిలోకెళ్లాడు. ఎదురుగ్గా మావయ్య పెంకుటిల్లు ఒక ప్రక్కంతా బాగా పాడయిపోయి కరువు కాటేసిన ఊరికి ప్రతినిధిలా వుంది.

''మావయ్యా!'' అని పిలుస్తూ ఇంటి మెట్లెక్కాడు.

లోపలంతా చీకటిగా వుంది.

''అత్తయ్యా!'' అని పిలిచాడు.

క్షణంతర్వాత 'ఎవరూ' అంటూ మావయ్య గొంతు.

''నేను శేఖరాన్ని.'' అన్నాడు.

వెలుగులోకి వచ్చి శేఖరాన్ని చూసి ''ఓరి నువ్వట్రా! ఎప్పుడొచ్చావ్'' అంటూ ఆప్యాయంగా పలకరించాడు.

''ఏమిటి మావయ్యా! ఇల్లింత చీకటిగా వుంది.''

''మీ అత్తయ్యకు ఒంట్లో బాగాలేదు. మలేరియా జ్వరం. చలిగా వుందంటే కిటికీలు మూశాను'' అని ఒక కిటికీ తెరిచాడు.

తెల్లటి ఎండ పొడ లోపలికొచ్చింది.

ఆ ఎండలో- ఆ గదిలో- ఒక మూలగా వున్న మంచం మీద అస్థిపంజరంలాంటి ఆకారాన్ని చూసి

'అర్థబలం-అంగ బలం ఉన్నవాడిదే రాజ్యం. న్యాయం లేదు. ధర్మం లేదు. స్వార్థం విలయ తాండవం చేస్తోంది. ఈ గూండా రాజ్యంలో సామాన్యుడు జీవించలేడు. ఎక్కడికైనా వలస వెళ్లాలి. లేదంటే ప్రాణాలు తీసుకోవాలేమో' అనుకున్నాడు.

కెవ్వుమనబోయి ఆపుకున్నాడు.

"మీ అత్తయ్యరా!"

"అదేమిటి మావయ్యా! అలా అయిపోయింది. మంది ప్పించడం లేదా?"

"మందా! హు..కాచిపొయ్యడానికి గంజినీళ్లు కూడా లేవు. ఈ ఊళ్లో డాక్టరులేడు. పట్నం తీసుకెళ్లే తాహతు లేదు. ఇక దేవుడి మీద భారం వేశాను." నిట్టూర్చాడాయన.

"అలా అంటే ఎలా మావయ్యా. అత్తయ్య చూడు ఎలా అయిపోయిందో. ఎలాగోలా పట్నం తీసుకెళ్లాల్సింది." శేఖర్ ఆరాటంగా అన్నాడు.

మావయ్య మాట్లాలేదు.

"మావయ్యా.. తీరుని చూస్తోంటే గుండె బ్రద్దలవుతోంది. మనందరికీ ఎంత అన్యాయం జరిగింది."

"అవున్రా. మేంమోసపోయాం. ఊరికి మందుల కంపెనీలొస్తాయంటే.. ఊరు బాగుపడుతుందనుకున్నాం. వాళ్లూ అలాగే చెప్పారు. ఫ్యాక్టరీ పెట్టాలంటే ఏదో రూల్సుంటాయిట. అవేమీ పాటించలేదు. చెట్లు పెంచాలిట. ప్రత్యేకం కాలువలు తవ్వుకోవాలిట. ఏమీ లేదు. లాభార్జనే చూసుకున్నారు కాని ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని చూడలేదు. ఊరిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. కాని ఊరిని అన్నివిధాలా నాశనం చేశారు."

"మీరందరూ వెళ్లి అడగలేదా?"

"అడిగాం. అడిగిన వాళ్లని జైల్లో పెట్టించాడు. నాయకులందరూ వాడిదే న్యాయమన్నారు. ఆ ధీమాతో ఈ చుట్టుప్రక్కల భూములన్నీ ఆక్రమించాడు. అవినీతి పాలనలో అన్యాయమే జయిస్తుంది. ఇక మా బతుకులు చివికిపోయాయి. మేము శాపగ్రస్తులమయ్యాము."

మావయ్య బాధగా అన్నాడు.

శేఖర్ ఏం మాట్లాడలేకపోయాడు.

అతనిలో ఆవేశం పెల్లుబుకుతోంది.

ఏదో చెయ్యాలి.

ఈ ఊరికి పూర్వపు వైభవం తేవాలి.

కాని ఎలా? ఎలా?

ఎవరు సహాయం చేస్తారు?

"కూర్చోరా శేఖరం.." చాలా ఏళ్లయింది నిన్ను చూసి..మంచి ఉద్యోగం దొరికిందా?" మావయ్య మాటల్లో ఈ లోకంలోకి వచ్చాడు.

"ఆ... ఉద్యోగం బాగా ఉంది... ఒక్కసారి అందర్నీ చూద్దామని వచ్చాను..." అని .."మావయ్యా! కమల.. రఘూ ఏరీ!" చుట్టూ చూస్తూ అడిగాడు.

"కమల లేదు.." పొడిగా అన్నాడు.

"ఎక్కడికెళ్లింది?"

"పట్నంలోని మిల్లులోకి ఆడకూలీలు కావాలిట..పనిప్పిస్తామని పట్నం నుండి బ్రోకర్లు వచ్చారు.

"మిల్లూ లేదు.. గిల్లూ లేదు. వీళ్లని గోవా తీసుకెడుతున్నారు. అక్కడ కమలలాంటి అందమైన అమ్మాయిలకు బోలెడు గిరాకీలు.. మీ మావయ్య కిదంతా తెలుసు. ఆయనకి బాగానే ముట్ట చెప్పారుగా."

వాళ్లు కమలని తీసుకెడుతున్నారు. ఇంతకు ముందే కమల వాళ్లతో వెళ్లింది!"

శేఖర్ ఆశ్చర్యపోయాడు.

"కమలని పట్నం తీసుకెడుతున్నారా? ఏవూరు? ఎక్కడ పనిప్పిస్తారు? ఆడపిల్ల అక్కడ ఒక్కతె ఎలా వుంటుంది?" ఆరాటంగా అడిగాడు.

"ఒక్కతే కాదురా. ఈ వూళ్లోని అమ్మాయిల్నందర్నీ తీసుకెడుతున్నారు. పనుల కోసం. ఇన్నాళ్లూ పంపలా. ఏం చేస్తాం! ఇష్టం లేకపోయినా ఇక పంపించక తప్పలేదు. బ్రోకరు అడ్వాన్సు కూడా ఇచ్చాడు. ఆ డబ్బు తీసుకుని రఘు పట్నం వెళ్లాడు మీ అత్తయ్యకి మందులు ఇంట్లోకి సరుకులు తేవడానికి" అన్నాడాయన నిర్లిప్తంగా.

ఆ మాటల్లో ఏదో కీడు ధ్వనించింది.

"ముందుగా అడ్వాన్సివ్వడమేమిటి? ఇందులో ఏదో మోసం వుంది. కమల అమాయకురాలు. మోసపోతోంది. చిన్నప్పట్నించీ తనూ కమలా ఎంతో స్నేహంగా ఉండేవారు. వయసు వస్తోన్న కొద్దీ స్నేహం ప్రేమగా మారింది. ఉద్యోగంలో స్థిరపడగానే కమలని పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. ఇప్పుడు తనకు మంచి ఉద్యోగం వుంది. అందుకే కమలని పెళ్లిచేసుకుని తనతో తీసుకెళ్లాలని ఎంతో ఆత్రంగా వచ్చాడు.

కాని కమల ఏదీ? వికసించిన కమలంలాంటి అందమైన నా కమల నా ప్రాణం.. నా ఆత్మ.. ఎక్కడికో వెళ్లిపోతోంది? ఏమైపోతుందో...

"మావయ్యా... ఇందులో ఏదో మోసం వుంది. జరగకూడనిదేదో జరగబోతోంది. ఎందుకో నా మనసు కీడుని శంకిస్తోంది. నేను వెళ్లి కమలని ఆపుతా.. ఆమె వెళ్లకుండా చేస్తాను." అన్నాడు శేఖర్ ఆవేశంగా.

మావయ్య భయంగా చూశాడు.

"ఎలారా! నేను డబ్బు తీసుకున్నాగా!" అన్నాడు నిస్సహాయంగా.

"నేనాడబ్బు వాడి ముఖాన కొట్టి కమలని తీసుకొస్తా...కమలని వాళ్లెటు తీసుకెళ్లారు?"

"ఊరి బయట ఆంజనేయస్వామి గుడి దగ్గరకు రమ్మన్నాడు కమలని. అక్కడకు లారీ వస్తుందిట ఊళ్లోని అమ్మాయిల్నందర్నీ..."

మావయ్య మాటలు పూర్తికాకుండానే శేఖర్ బయటికి పరుగెత్తాడు.

"ఎక్కడికిరోయ్ శేఖర్! ఆ పరుగు?' అంటూ శ్రీనివాసులు మళ్లా ఎదురొచ్చాడు.

"ఆంజనేయస్వామి గుడి దగ్గరకు.."

"ఒరేయ్ శేఖరం.. ఎడ్లు పోతే పోయాయిగాని బలే డబ్బులొచ్చాయిరా. నేను పట్నం పోతున్నా. ఇంట్లోకి సరుకులు కొనడానికి నువ్వు కూడా రారాదూ.. మనం కాస్త ఎంజాయ్ చేద్దాం!" హుషారుగా అన్నాడు.

శేఖర్‌కి ఆ మాటలేమీ విన్పించడం లేదు.

"నేను వెళ్లి ముందు కమలని చేరాలిరా!"

"కమలా.. ఎవరూ!" బిత్తరపోతూ అడిగాడు.

"మా మావయ్య కూతురు. పట్నంలో పనికోసం వెడుతోంది. ఆంజనేయస్వామి గుడి దగ్గర లారీ వుందిటగా.. కమలని అక్కడకు రమ్మన్నారుట..."

"ఓ అదా.. అమ్మాయిలందరూ లారీ ఎక్కేశారు. ఈ పాటికి వెళ్లిపోయి వుంటుంది..."

"పట్నంలో ఏ మిల్లుకు తీసుకెడుతున్నారు?"

ఫెళ్లున నవ్వాడు శ్రీనివాసులు.

"మిల్లూ లేదు.. గిల్లూ లేదు. వీళ్లని గోవా తీసుకెడుతున్నారు. అక్కడ కమలలాంటి అందమైన అమ్మాయిలకు బోలెడు గిరాకీలు.. మీ మావయ్యకిదంతా తెలుసు. ఆయనకి బాగానే ముట్ట చెప్పారుగా."

శేఖర్‌కి తలతిరిగిపోయింది.

తను ఊహించిందే జరుగుతోంది. దేవుడా ఎలా వీళ్లని రక్షించడం..

శేఖర్ శ్రీనివాసులు బుజాలు పట్టుకుని కుదుపుతూ.." ఇంత ఘోరం జరుగుతోంటే.. ఊళ్లో ఎవ్వరూ అడ్డుకోవడం లేదా?" అన్నాడు కోపంగా.

"అరె! ఎంత వెర్రివాడవురా! జరిగేదంతా అందరికీ తెలుసు. కానీ ఏంచేస్తారు? ఆకలి నాయనా.. దాని ముందు అన్నీ బలాదూర్! అమ్ముకోడానికి ఈ ఊళ్లో మిగిలుంది అమ్మాయిలే!" అన్నాడు.

శేఖర్‌కి గుండెల్లోంచి దుఃఖం తన్నుకు వస్తోంది. శరీరం వణికిపోతోంది.

ఎలాగైనా ఈ దారుణాన్ని ఆపాలి. కమలని కాపాడుకోవాలి. కమల లేకపోతే తను బ్రతకలేడు.

"శ్రీనివాసులూ! రారా. మనం వెళ్లి ఆ లారీని ఆపుదాం. నా కమలని కాపాడుకోవాలి."

"కుదరదేమో!" నసిగాడు శ్రీనివాసులు.

"ఎంత డబ్బడిగినా వాళ్ల ముఖాన పారేస్తాను. ముందు నడు."

శ్రీనివాసులు చెయ్యి పుచ్చుకుని పరుగెట్టసాగాడు శేఖర్.

వాళ్లు మరో ఫర్లాంగు దూరంలో ఉండగానే లారీలు కదిలిపోయాయి.

"ఇక లాభం లేదురా శేఖరం. అదుగో అదేరా ఆఖరి లారీ, అమ్మాయిలతో వెళ్లిపోతోంది.. దాన్లోనే నీ కమల వుంటుంది." అన్నాడు శ్రీనివాసులు అయాసపడుతూ ఆగిపోయి.

శేఖర్ వెర్రిగా చూశాడు.

"నా కమల వెళ్లి పోతోందా నేనేం చేయను.. ఎలా ఆపను. నా గుండె బ్రద్దలై పోతోందిరా. నేనెలా తట్టుకోగలను. ఎవరు కాపాడతారు వీళ్లని? భగవంతుడా. నువ్వయినా రక్షించలేవా! నా ఊరిని.. నా కమలను..."

ప్రపంచం గిర్రున తిరిగిపోతుండగా నేలపై ఒరిగిపోతున్నాడు శేఖర్!

★